చూసాడు. నీళ్ళని అల్లకల్లోలం చేస్తూ అది తొండంతో నీళ్ళని తన వంటి మీద చల్లుకుని, శుభ్రంగా మురికి వదిలేలా స్నానం చేసింది. గట్టు మీదకి రాగానే తిరిగి తొండంతో మట్టిని తీసుకుని ఒళ్ళంతా చల్లుకుని వెళ్ళిపోయింది.

వెంటనే సాధువు తనకి ఏం చెప్పాడో అతనికి బోధ పడింది. తను నిత్యం ధ్యానం, భజనలనే స్నానం చేస్తూ పూర్వం చేసిన దుష్కర్మలనే మురికిని వదిలించుకుంటున్నాడు. తిరిగి లోక వ్యవహారాల్లోకి రాగానే, పాపాలు చేస్తున్నాడు. అతనికి సాధువు హితబోధ అర్థం అవడంతో రచ్చబండ దగ్గర చేరి వాళ్ళ మీద, వీళ్ళ మీద నిందలు వినడం, చెప్పడం లాంటి చెడు పనులన్నిటినీ ఆ రోజుతో కట్టిపెట్టాడు.

## 34. రెండు భాగాలు

ఓ సాధువు ఓ గ్రామానికి వచ్చాడు. అక్కడి రామాలయంలో ఆ రోజు బ్రహ్మోత్సవం జరుగుతోంది. ఉదయం నించి సాయంత్రం దాకా అతను ఆ గ్రామస్థుల చర్యలన్నిటినీ గమనించాడు. సాయంత్రం ఆయన చెప్పే సత్సంగానికి గ్రామస్థులంతా హాజరయ్యారు.

"మా భక్తి ఎలా ఉంది స్వామి?" ఒకరు అడిగారు.

"బావుంది కాని మీ భక్తి మతపరమైంది. అక్కడితో ఆగే భక్తి వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు." జవాబు చెప్పాడు ఆ సాధువు.

"అదేమిటి స్వామి?"

"అవును. ప్రతీ మతానికి రెండు భాగాలుంటాయి. బయటిది. లోపలిది. బయటది ఆచారాలకి సంబంధించింది. అది మేధావుల చేత ఏర్పరచబడినది. లోపలిది వేదాంత లేదా ఆధ్యాత్మిక భాగం. బయటి దానికి విలువ ఇచ్చేవారు లోపలకి వెళ్ళలేరు. మతాలు బాణం గుర్తులు మాత్రమే. గమ్యం ఆత్మ సాక్షాత్కారం. ఎవరైనా ఓ చెట్టుకి ఉన్న పండుని వేలితో చూపిస్తే నువ్వు వేలు నించి ఆ పండు వైపు చూసి వెళ్ళి దాన్ని కోసుకుంటేనే ఆ ఫలాన్ని అనుభవిస్తావు. వేలు నించి దూరంగా చూడకుండా మీరంతా వేలు దగ్గరే ఆగిపోయారు. మీరంతా ఆ ఫలాన్ని

అనుభవించడం కోల్పోయి, వేలుకే బందీలైపోయారు. అంటే మీరు మతాన్ని వివాహం చేసుకుని దేవుడికి విడాకులిచ్చేసారు."

"మమ్మల్ని ఏం చేయమంటారు స్వామి?"

ఆ సాధువు రకరకాల ఆధ్యాత్మిక సాధనల గురించి వారికి బోధించాడు.

## 35. కోపధారి

కోపధారి మనిషి అయిన తన చిన్న కొడుకు అందరి మీదా నోరు పారేసుకోవడం గమనించిన ఓ తండ్రి ఓ రోజు అతన్ని ఇంటి వెనక ఉన్న గోడ దగ్గరకి తీసుకెళ్ళాడు.

అతని చేతికి ఓ సుత్తి, కొన్ని మేకులున్న సంచీ ఇచ్చి చెప్పాడు.

"ఇకనించి నీకు ఎవరి మీదైనా కోపం వచ్చి వాళ్ళని తిట్టినప్పుడల్లా ఆ గోడ మీద ఓ మేకుని కొడుతూండు. నువ్వు అలా ఒక్క మేకు కూడా కొట్టాల్సిన అవసరం రాని రోజు ఆ సంగతి నాకు చెప్పు."

అందుకా కొడుకు అంగీకరించాడు. మొదటి రోజు అతను గోడ మీద ముప్పై ఏడు మేకులు కొట్టాడు. మర్నాడు ముప్పై తొమ్మిది. కొద్ది రోజులు గడిచే కొద్దీ అతను గోడ మీద కొట్టే మేకుల సంఖ్య క్రమేపీ తగ్గు ముఖం పట్టింది. కొన్ని నెలల తర్వాత అతని తండ్రి ఆశించినట్లుగా, అతను ఎవర్నీ కోపంతో తిట్టని రోజు ఒకటి వచ్చింది. ఆ రోజు గోడ మీద ఒక్క మేకు కూడా కొట్టలేదు. అతను ఆనందంగా వెళ్ళి తండ్రికి చెప్పాడు.

"నాన్నా! నేను గత వారం రోజులుగా గోడ మీద ఒక్క మేకు కూడా కొట్టలేదు."

అతను ఎదురు చూసినట్లుగా తండ్రి అతన్ని అభినందించలేదు. తన కొడుకుని ఆయన ఇంటి వెనక గోడ దగ్గరకి తీసుకు వెళ్ళి చెప్పాడు.

"ఇన్నాళ్ళుగా నువ్వు కొడుతున్న ఆ మేకులన్నిటినీ పీకేయ్."

కొడుకు వెంటనే తండ్రి చెప్పినట్లుగా చేసాడు. తర్వాత తండ్రి తన కొడుకుతో చెప్పాడు.